ప్రజాశక్తి
సోమవారం 10 జులై 2023
5
విజయనగరం

సిపిఎస్ రద్దు చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని పిఆర్‌టియు నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక జెడ్‌పి సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ డిప్యూటీ డిఇఒ పోస్టులు ఉమ్మడి సీనియారిటీ ప్రకారం నింపాలన్నారు. ప్రతి ఉన్నత పాఠశాలకు కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించాలన్నారు. జిల్లాల విభజనకు సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వులు త్వరగా తెప్పించి ఉమ్మడి సీనియారిటీ అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులను కేవలము బోధనకే పరిమితం చేసి బోధనేతర పనులు సచివాలయ సిబ్బందికి అప్పగించాలన్నారు. మెరుగైన పి ఆర్. సి అమలు చెయ్యాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు వి.రవీంద్ర నాయుడు, జనరల్ సెక్రెటరీ డి. శ్రీనివాస్, రావాడ రాంబాబు. బంకపల్లి శివ ప్రసాద్, డి.వెంకట రావు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ పరిరక్షణ, వేతనాల పెంపు కోసం..

అంగన్వాడీల ఆందోళనబాట

అమ్మ తరువాత అమ్మలై... ప్రభుత్వ పథకాల అమలులో కీలకపాత్రదారులై... చివరికి ఉద్యోగ భద్రతకు నోచుకోక, గౌరవ ప్రదమైన వేతనాలూ అందుకోలేక, రాజకీయ వివక్షతో కొట్టుమిట్టాడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు మరో పోరాటానికి సిద్ధమయ్యారు. అందుకు సన్నద్ధంగా ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ ఈనెల 10,11 తేదీల్లో విజయనగరం, పార్వతీపురం మన్యం కలెక్టరేట్ల వద్ద 36 గంటల పాటు మహాధర్నా చేపట్టేందుకు సన్నద్ధమయ్యారు. సోమవారం ఈ రెండు జిల్లాల కలెక్టరేట్లకు అంగన్‌వాడీలు తరలి రానున్నారు. ఇప్పటికే ఏపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు దీక్షలకు సంబంధించిన సన్నాహాలు చేశారు.

చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్న అంగన్వాడీ కార్యకర్త

- నేటి నుంచి కలెక్టరేట్ ఎదుట 36 గంటల మహాధర్నా
- తరలిరానున్న అంగన్‌వాడీలు, ఆయాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం జిల్లాలో 12 ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2206 అంగన్‌వాడీకేంద్రాలు, 293 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. తల్లిపిల్లల ఆరోగ్య పరిరక్షణలోనూ, చిన్నారుల ఆలనపాలనలోనూ నిత్యం తలమునకలై పనిచేస్తున్న అంగన్‌వాడీలకు అన్నింటా సమస్యలు వెంటాడుతున్నాయి. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9ఏళ్లు కావస్తున్నా అంగన్వాడీల సమస్యలు పరిష్కారం కాకపోగా, మరింత జఠిలమయ్యాయి. ఐసిడిఎస్‌కు నిధులు పెంచాల్సింది పోయి, కుదిస్తోంది. లక్ష్యానికి విరుద్ధంగా సెంటర్లు కుదించటానికి నూతన విద్యావిధానాన్ని తీసుకువచ్చింది. ఈ కాలంలో ప్రభుత్వ విధానాల వల్ల పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు అనేక రెట్లు పెరిగాయి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు నయా పైసా కూడా పెంచలేదు.

ఏపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన నిర్వహించిన అనేక పోరాటాల ఫలితంగా 2018లో అంగన్వాడీ వర్కర్లకు 1500, హెల్పరుకు రూ.750, మినీ వర్కరుకు రూ.1250 పెంచుతున్నట్లు ప్రకటన చేసినప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. దశాబ్దాలు తరబడి పనిచేస్తున్న కార్యకర్తలకు కూడా రూ.11,500, ఆయాలకు రూ.7,500 మాత్రమే అందుతున్నాయి. వేతనాలు పెంచుతామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేకసార్లు హామీలు ఇచ్చినప్పటికీ అమలుకు నోచుకోలేదు. కనీస వేతనం, ఉద్యోగ భద్రత, పెన్షన్, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యూటీ అమలు చేయాలని అనేక సార్లు వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించినా ప్రభుత్వానికి చలనం రాలేదు. 2017 నుండి టిఎ బిల్లులు ఇవ్వడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాలకు కమర్షియల్ కేటగిరి కింద మీటర్లు మార్చడంతో అధిక బిల్లులు వస్తున్నాయి. ఈ బిల్లులతోపాటు అద్దెలు సకాలంలో విడుదల చేయడం లేదు. విధుల్లో చేరినప్పటి నుంచీ గ్రాట్యుటీ చెల్లించాలంటూ 2022 ఏప్రిల్ 25న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు అమలుకు ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. లబ్ధిదారులను కుదించటానికి పోషణ ట్రాక్ యాప్‌ను తీసుకువచ్చింది. ప్రైవేటీకరణ విధానంలో భాగంగా రకరకాల యాప్‌లు తెచ్చి పనిభారం పెంచారు. మరోవైపు ఆగస్టు నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం పంపిణీని నిలిపివేసి, ఇంటింటి రేషన్ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో సమస్యల పరిష్కారానికి 36గంటల ధర్నాకు పిలుపునిచ్చారు.

ఇవీ డిమాండ్లు

- ఐసిడిఎస్‌కు బడ్జెట్‌లో నిధులు పెంచాలి
- సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలి
- మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి
- హెల్పర్ల ప్రమోషన్లకు వయసు 50ఏళ్లకు పెంచాలి.
- రాజకీయ జోక్యం అరికట్టాలి
- పిల్లలకు అమ్మఒడి, యూనిఫారం ఇవ్వాలి
- సర్వీసులో ఉండి చనిపోయిన కార్యకర్తల కుటుంబీకుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి.
- 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న డిఎ బిల్లులు ఇవ్వాలి.
- వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలి.

సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాటం

సమస్యలు పరిష్కారం చేసేవరకు పోరాడతాం. తామేమీ గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదు. కనీస వేతనాలు అడుగుతున్నాం. ప్రభుత్వానికి కొంత చాకిరీ చేసినందుకు ఉద్యోగులుగా గుర్తించమంటున్నాం. ఐసిడిఎస్‌ను పూర్తిగా నిర్వీర్యం చేయడం తగదు. ఇటువంటి చర్యల వల్ల తమ ఉద్యోగ భద్రతకు ముప్పువాటిల్లడంతోపాటు తల్లి, పిల్లలకు, గర్భిణుల ఆరోగ్యానికి రక్షణ ఉండదు. ఈనేపథ్యంలో చేస్తున్న పోరాటానికి ప్రభుత్వం దిగిరాకపోతే మరింత ఉధృతం చేస్తాం.

– ఎస్.అనసూయ,
ఏపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

మోడల్ స్కూల్ సీట్లకు

పెరిగిన డిమాండ్

కెజిబివిల్లోనూ అదే పరిస్థితి ● నాణ్యమైన విద్య, ఉత్తీర్ణతా శాతం పెరగడమే కారణం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఒకప్పుడు మోడల్ స్కూల్, కస్తూరిబా గురుకుల పాఠశాలల్లో సీట్లు నింపడం కోసం ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రభుత్వం తరపున సభలు, సమావేశాల్లో పదేపదే చెప్తుండేవారు. ఈ స్కూళ్లలో నాణ్యమైన విద్య అందుతుందని, పేదలకు ఈ స్కూళ్లు మంచి వరం లాంటివని అనేవారు. ప్రస్తుతం పరిస్థితి తలకిందులైంది. అదే ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు వాటిలో సీటు కోసం సిఫార్సులు చేసినా అవకాశం దక్కే పరిస్థితి లేదు. క్రమశిక్షణతో కూడిన విద్య, పదవ తరగతిలో ఉత్తీర్ణతా శాతం పెరగడం వంటివి ఇందుకు కారణం.

జిల్లాలో మొత్తం 13 మోడల్ స్కూళ్లు ఉన్నాయి. వీటిలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 100సీట్లు, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ఎంపిసి, బైపిసి, హెచ్ఇసి, సిఇసి గ్రూపుల్లో 40చొప్పున మొత్తం 160సీట్లు ఉన్నాయి. కస్తూరిబా బాలిక విద్యాలయాలు మండలానికి ఒకటి చొప్పున ఉన్నాయి. వీటిలో కూడా దాదాపు మోడల్ స్కూళ్ల మాదిరిగానే సీట్లు ఉన్నాయి. ముఖ్యంగా ఉత్తీర్ణతా శాతం పెరగడం, క్రమశిక్షణ, నాణ్యమైన విద్య అందుతోంది. గడిచిన విద్యాసంవత్సరంలో 1223మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయగా 1108మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణతా శాతం 91.60గా నమోదైంది. ఇందులో 954మంది మొదటి శ్రేణిలో నిలవడం గమనార్హం. తృతీయ శ్రేణిలో 128మంది, తృతీయ శ్రేణిలో కేవలం 26మంది మాత్రమే ఉన్నారు. మూడేళ్ల క్రితం నుంచి స్వల్పంగా ఉత్తీర్ణతా శాతం పెరుగుతూ వస్తోంది. ఈనేపథ్యంలో మోడల్ స్కూళ్లు అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాయి. ఎంట్రన్స్ టెస్ట్ ఆధారంగా సీట్లను భర్తీచేశారు. తొలి కౌన్సిలింగ్‌లోనే సీట్లన్నీ భర్తీ అయిపోయాయని అధికారులు అంటున్నారు. ప్రతిభకుతోడు రిజర్వేషన్ కూడా వర్తింపజేసినట్టు చెబుతున్నారు. ఈనేపథ్యంలో మోడల్ స్కూళ్లలో సీట్లకోసం చాలా మంది ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల సిఫార్సు చేయించుకుంటున్నప్పటికీ ఉపయోగం లేకపోతోంది. ఈ స్కూళ్లలో వచ్చే ఏడాది నుంచైనా సీట్లు పెంచి, అందుకనుగుణంగా ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయడం లేదా మండలానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. మరోవైపు కేవలం కెజిబివిల్లోను సీట్లకు మంచి డిమాండ్ ఉంది. ఇక్కడ కూడా చదువుతోపాటు క్రమశిక్షణ కనిపిస్తోంది. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన తల్లిదండ్రులు, తల్లిదండ్రులను కోల్పోయిన బాలికలకు ఆసరాగా నిలుస్తోంది. హాస్టళ్లలో మెరుగైన సదుపాయాలతోపాటు మెరుగైన మెనూ, ప్రభుత్వ పర్యవేక్షణ ప్రత్యేకంగా కనిపిస్తోంది.

అక్రమ వాటర్ ప్లాంట్లను సీజ్ చేయాలని

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో అనుమతులు లేకుండా అక్రమంగా నడుపుతున్న వాటర్ ప్లాంట్‌లన్నింటినీ సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్లు పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షులు కంది త్రినాథ్ తెలిపారు. ఈ మేరకు ధర్నాను జయప్రదం చేయాలని ఎల్‌బిజి నగర్, అయ్యన్నపేట, వేణుగోపాలపురం, తోటపాలెం, గంజిపేటలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే అయ్యప్పనగర్, ఎస్‌విఎన్ నగర్, తోటపాలెం, వైఎస్సార్ నగర్, కెఎల్ పురం, గంజిపేట, ఎల్‌బిజి నగర్, రామకృష్ణ నగర్, వేణుగోపాల పురం తదితర చోట్ల వాటర్ ప్లాంట్‌ల వలన స్థానిక ప్రజల ఇళ్లల్లో బోర్లు ఇంకిపోయి నీటికోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అయా ప్రాంతాల్లో మున్సిపల్ కుళాయిలు లేవని, వ్యక్తి గత కుళాయిలు వేయమంటే మెయిన్ పైపులైన్ వేయలేదని అన్నారు. అయ్యప్ప నగర్‌లో మెయిన్ పైప్ లైన్ ఉన్నప్పటికీ కుళాయిలు వేయాలంటే కోటి నలభై లక్షలు ఖర్చవుతుందని చెప్పి అధికారులు తప్పించుకుంటున్నారని అన్నారు. కలెక్టరేట్ వద్ద ధర్నాలో ప్రజలంతా పాల్గొనాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి రమణ, అధ్యక్షులు జగన్మోహన్, ఐద్వా నగర కార్యదర్శి వి. లక్ష్మి, కృష్ణమ్మ, తది తరులు పాల్గొన్నారు.



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని చందులూరు గ్రామ పంచాయతీలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, ఆర్‌బికె, వెల్నెస్ సెంటర్‌లకు జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం వైసిపి పాలనలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంటే వాటిని అడ్డుకునే ప్రయత్నం టిడిపి చేస్తుందని మండిపడ్డారు. అభివృద్ధిని అడ్డుకునేందుకు ఎందరు ప్రయత్నించినా సంక్షేమ పథకాలు ఆగవని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అనంతరం వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. గ్రామ సర్పంచ్ యడ్ల సింహాచలం, ఎంపిటిసి యడ్ల కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ఎంపిపి గేదెల శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి తూర్పాటి వరలక్ష్మి, మాజీ సర్పంచ్ యడ్ల సత్యారావు, ఎంపిడిఒ జ్ఞానేశ్వరరావు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ నెక్కల నాయుడుబాబు , డిసిసిబి చైర్మన్ వేచలపు చినరామనాయుడు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి బొత్స జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ జన్మదిన వేడుకలు ఆదివారం ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. మంత్రి బొత్సకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పి.రాజన్నదొర, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు ఆయన నివాసంలో కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు కడుబండి శ్రీనివాసరావు, బడుకొండ అప్పలనాయుడు, కంబాల జోగులు, మన్యం జిల్లాకు చెందిన మాజీ మంత్రి పుష్పశ్రీవాణి, అలజంగి జోగారావు, శ్రీకాకుళం జిల్లాకు చెందిన మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, ఎమ్మెల్సీలు పాలవలస విక్రాంత్, రఘురాజు, పెనుమత్స సురేష్‌బాబు, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, నగరంలోని పలువురు కార్పొరేటర్లు మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. విజయనగరం డిఆర్ఒ గణపతిరావు, పార్వతీపురం డిఆర్ఒ వెంకటరావు, ఆర్‌డిఒ సూర్యకళ తదితర అధికారులు మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మంత్రి బొత్సతో కేక్ కట్ చేయించారు. మంత్రి సతీమణి బొత్స ఝాన్సీలక్ష్మి, కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కేకు కట్ చేస్తున్న మంత్రి బొత్స దంపతులు; దుస్తులు పంపిణీ చేస్తున్న సీతం కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు

సత్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో

విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ జన్మదిన వేడుకలు ధీర ఫౌండేషన్, సత్యా విద్యాసంస్థలైన సీతం ఇంజినీరింగ్ కళాశాల, సత్యా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని కనకమహాలక్ష్మి దేవాలయం వద్ద , ప్రేమ సమాజం వృద్ధాశ్రమం వద్ద, పైడితల్లి అమ్మవారు దేవాలయం వద్ద, సీతం కళాశాల వద్ద , వికలాంగులకు చక్రాల కుర్చీలు, కృత్రిమ అవయవాలు, వినికిడి పరికరాలు, చీరలు, బెడ్‌షీట్లు, పండ్లు, బ్రెడ్, భోజనం, పండ్ల రసాలు, వాటర్ బాటిళ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. సీతం కళాశాలలో విద్యార్థులందరూ 50 కిలోల భారీ కేక్‌ను కట్ చేసారు. కార్యక్రమాలలో సత్య విద్యాసంస్థల సంచాలకులు డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ఎన్‌సిసి ఆఫీసర్ కెప్టెన్ సత్యవేణి, సిఎస్ఒ సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ మహేశ్వరరావు, మేనేజర్ లెంక రాము, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తవలస : తుమ్మికాపల్లి వద్దనున్న వాగ్దేవి విద్యాసంస్థల్లో మంత్రి బొత్స సత్యనారాయణ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో అధ్యాపకులు, విద్యార్థులు కేక్ కట్ చేసి, మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్తవలసలోని చైతన్య బధిర, మానసిక వికలాంగుల పాఠశాలలో సుమారు 100 మందికి కరస్పాండెంట్ కొటిన మహేశ్వరరావు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.

నెల్లిమర్ల : నగర పంచాయతీలో గాంధీనగర్ కాలనీలో మంత్రి బొత్స సత్యనారాయణ జన్మదినం సందర్భంగా గంటా అప్పలరాజు, వైసిపి సీనియర్ నాయకులు సతీష్, గౌరీదేవి ఆధ్వర్యంలో కేకు కట్ చేశారు. అనంతరం 150 మందికి చీరలు పంపిణీ చేశారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

సైన్స్‌తోనే మనుగడ

- సైన్స్, చరిత్ర పాఠ్యాంశాల తొలగింపు అన్యాయం
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-బొబ్బిలి

సైన్స్‌తోనే మానవ మనుగడ ముడిపడి ఉందని, అలాంటి సైన్స్‌తోపాటు చరిత్ర పాఠ్యాంశాలను పాఠ్య పుస్తకాల నుంచి తొలగించడం అన్యాయమని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రౌతు రామ్మూర్తి, ఎస్‌టియు నాయకులు జెసి రాజు, ఎయిడెడ్ టీచర్స్ యూనియన్ నాయకులు కె.కృష్ణదాస్, హిస్టరీ లెక్చరర్ వి.శంకరరావు అన్నారు. సైన్స్, చరిత్ర పాఠ్యాంశాల తొలగింపునకు వ్యతిరేకంగా ప్రజా, ఉద్యోగ, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఎన్‌జిఒ హోంలో యుటిఎఫ్ నాయకులు వై.స్వామినాయుడు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ పౌరులకు విలువలతో కూడిన విజ్ఞానాన్ని అందించాలంటే, రాజ్యాంగ విలువలు అమలు కావాలంటే చరిత్ర పాఠ్యాంశాలు తొలగించకూడదన్నారు. మానవ జీవన గమనమే సైన్స్ అని, అటువంటి శాస్త్రాన్ని కనుమరుగు చేయాలని చూడటమేమిటని నిలదీశారు. మనువాద సిద్ధాంతాన్ని తీసుకురావడమంటే భావిభారత పౌరులకు ఏమీ తెలియకుండా చేయడమేనన్నారు. కేంద్రం నిర్ణయాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. నిరూపణకు నిలబడే సైన్స్‌ను నేర్చుకోకుండా చేసే చర్యలు నూతన విద్యా విధానం నుండే రూపొందించారని, ఇటువంటి విధానాలను ఐక్యంగా తిప్పికొట్టాలని కోరారు. విద్యారంగం తిరోగమన చర్యలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సైన్స్, చరిత్ర తొలగింపును వ్యతిరేకంగా ఈ నెల 15న పట్టణంలో ప్రదర్శన చేపట్టేందుకు తీర్మానించారు. కార్యక్రమంలో జెవివి నాయకులు ఆనెం శ్రీనివాస్, గ్రీన్ బెల్ట్ సొసైటీ జిల్లా అధ్యక్షులు ఎస్‌వి రమణమూర్తి, ఎన్‌జిఒ నాయకులు రామారావు, ఎఐఎస్ఎఫ్ నాయకులు రవికుమార్, ఎస్ఎఫ్ఐ నాయకులు పుణ్యవతి, తదితరులు పాల్గొన్నారు.

రూ.9065 కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక

2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.9065 కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక రూపొందించామని లీడ్‌బ్యాంకు జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఇందులో ప్రాధాన్యతా రంగాలకు రూ.7,475కోట్లు, ప్రాధాన్యేతర రంగాలకు రూ.1,590 కోట్లు చొప్పన కేటాయించినట్టు చెప్పారు. అత్యధికంగా వ్యవసాయ రంగానికి రూ.5,823 కోట్లు, ఇందులో పంట రుణాలు రూ.3,432 కోట్లు చొప్పన విభజించినట్టు వివరించారు. వీటితోపాటు వ్యవసాయ రంగంలో మౌలిక సదుపాయాలు, మార్కెటింగ్‌లకు విరివిరిగా నిధులు కేటాయించినట్టు పేర్కొన్నారు. ఈసారి దీర్ఘకాలిక రుణాలకు కూడా ఎక్కువ మొత్తంలోనే కేటాయింపులు జరిగాయని, వీటన్నింటినీ రైతులు, వ్యాపారులు, చిన్న పరిశ్రమలు పెడదామనుకునేవారు ఉపయోగించుకోవాలని కోరారు. తనను కలిసిన ప్రజాశక్తికి ఎల్‌డిఎం ఎ.శ్రీనివాసరావు ముఖాముఖీ ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే..

– ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

- ప్రాధాన్యతా రంగాలకు రూ.7,475 కోట్లు
- ప్రాధాన్యేతర రంగాలకు రూ.1,590 కోట్లు
- అత్యధికంగా వ్యవసాయ రంగానికి రూ.5,823 కోట్లు
- పంట రుణాలు రూ.3,432 కోట్లు
- ప్రజాశక్తితో లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు ముఖాముఖి



☞ ఈ ఏడాది రుణ ప్రణాళిక ఏ విధంగా ఉంది?

వార్షిక రుణ ప్రణాళిక గతంతో పోలిస్తే బాగా పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం రూ.7509కోట్లతో రుణ ప్రణాళిక రూపొందించాం. లక్ష్యానికి మించి (106.1శాతం) రూ.7,975 కోట్ల మేర రుణాలు అందజేశాం. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.9,065 కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక రూపొందించాం. ఇందులో ప్రాధాన్యతా రంగాలకు రూ.7,475కోట్లు, ప్రాధాన్యేతర రంగాలకు రూ.1,590 కోట్లు చొప్పన కేటాయించాం.



☞ వ్యవసాయ రంగానికి ఎంత ప్రాధాన్యత?

మొత్తం కేటాయింపులో వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చాం. మొత్తంగా రూ.5,823కోట్లు కేటాయించగా ఖరీఫ్ పంట రుణాలకు రూ.2,025 కోట్లు, రబీ పంటలకు రూ.1,407 కోట్లు చొప్పున అందజేయాలని జిల్లా అధికార యంత్రాంగం, వ్యవసాయ సలహా మండలి నిర్ణయించింది. ఇవి కాకుండా రైతులకు రూ.2,136 కోట్ల మేర దీర్ఘకాలిక రుణాలు, కోల్డ్ స్టోరేజీలు, వ్యవసాయ గిడ్డంగులు, వాటర్‌షెడ్, బయోగ్యాస్ వంటి రూపాల్లో అగ్రికల్చర్ ఇన్‌ఫ్రా డవలప్‌మెంట్ కోసం రూ.101కోట్లు, అగ్రి క్లినిక్స్, అగ్రి బిజినెస్ సెంటర్స్, అగ్రి సొసైటీలు, మైక్రో ఫైనాన్స్ తదితర రూపాల్లో రూ.154కోట్లు చొప్పున అందజేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

☞ ఇతర ప్రాధాన్యతా రంగాలకు కేటాయింపులు ఎలా ఉన్నాయి?

వ్యవసాయ రుణాలతోపాటు స్వయం ఉపాధి, సూక్ష్మ, చిన్నపరిశ్రమల ఏర్పాటు తదితరాలన్నింటినీ ప్రభుత్వం ప్రాధాన్యతారంగాలుగా భావిస్తుంది. మొత్తం ప్రాధాన్యతా రంగాలకు రూ.7,475కోట్లు కేటాయించగా, ఇందులో వ్యవసాయరంగం మినహా మిగిలిన వాటికి రూ.441కోట్లు, కేవలం సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు రూ.1,211 కోట్లు కేటాయించాం. రూ.20లక్షల నుంచి రూ.25లక్షలు దాటిన హౌసింగ్, ఎడ్యుకేషన్, పర్సనల్ లోన్స్ తదితరాలు ప్రాధాన్యేతర రంగాల్లోకి వస్తాయి. వీటికి రూ.1,590కోట్లు కేటాయించాము.

☞ కౌలు రైతులకు పంట రుణాలు ఇచ్చే అవకాశం ఉందా?

కౌలు రైతులకు కూడా తప్పకుండా బ్యాంకు ద్వారా రుణాలు పొందే అవకాశం ఉంది. కౌలు రైతులకు సిసిఆర్‌సి (క్రాప్ కల్టివేషన్ రైట్ కార్డు)లను రెవెన్యూ అధికారులు జారీచేస్తున్నారు. వీటి ఆధారంగా బ్యాంకులో పంట రుణాలు పొందేందుకు సౌలభ్యం ఉంది. జిల్లాలో 10,176 మంది కౌలు రైతులు ఉన్నట్టు సమాచారం. వీరిలో 1180మందికి సిసిఆర్‌సి కార్డులు ఉన్నాయి. వీరంతా నిరభ్యంతరంగా రుణాలు పొందవచ్చు. వీరికోసం ఈ ఏడాది రూ.34కోట్లు కేటాయించడం జరిగింది. వీరి మాదిరిగానే ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 195మంది చేనేత కార్మికులకు రూ.97.50కోట్లు కేటాయించాం.

☞ బ్యాంకు లింకేజీ రుణాల పరిస్థితి ఎలా ఉంది?

బ్యాంకు లింకేజీ రుణాలు కూడా ఏటా లక్ష్యానికి మించి ఇస్తున్నాం. గత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని గ్రామీణ ప్రాంతంలో రూ.1,042కోట్ల మేర బ్యాంకు లింకేజీ రుణాలు అందజేయాలని లక్ష్యం పెట్టుకోగా ఆచరణలో రూ.1,170కోట్ల మేర ఇచ్చాం. పట్టణ ప్రాంతాల్లో రూ.175కోట్లకు గాను రూ.243కోట్లు పంపిణీ చేశాం. ఈ ఏడాది (2023-24వ ఆర్థిక సంవత్సరం) గ్రామీణ ప్రాంతంలో 1,765కోట్లు, పట్టణ ప్రాంతాల్లో రూ.349కోట్లు మేర రుణ సదుపాయం కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించాం. ముద్రా లోన్లు గత ఏడాది జిల్లా వ్యాప్తంగా రూ.360కోట్ల మేర ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా రూ.289కోట్లు (80శాతం) మేర రుణాలు అందజేశాం.



రేషన్ కోసం డిపో వద్ద వేచి ఉన్న మహిళలు

రేషన్ కోసం నిరీక్షణ

ప్రజాశక్తి-బొబ్బిలి

ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఎండియు అపరేటర్లను నియమించి వాహనాలను సమకూర్చింది. కానీ, బొబ్బిలి పట్టణంలోని సిరిపురపువీధిలో ఉన్న 307 రేషన్ షాపు లబ్ధిదారులకు సరుకులు అందడం లేదు. రెండు నెలలుగా ఇంటింటికీ సరుకులు ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు రేషన్ షాపునకు వెళ్లి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. సరుకులు ఎప్పుడు ఇస్తారోనని రేషన్ షాపు వద్ద నిరీక్షిస్తున్నారు. అధికారులు స్పందించి ఇంటింటికి రేషన్ సరుకులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

టిడిపిని ప్రజలు నమ్మరు

ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి

రాష్ట్రంలో టిడిపి నమ్మే స్థితిలో ప్రజలు లేరని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో రోజురోజుకు ఆదరణ పెరగడం వల్లే టిడిపి నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. టిడ్కో ఇళ్లలో 20 శాతం పనులు టిడిపి ప్రభుత్వం చేస్తే, మిగతా పనులన్నీ వైసిపి ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు. మూడు నెలల్లో లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లను పంపిణీ చేస్తామన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. టిడిపి ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా ప్రజలు నమ్మరని, రాష్ట్రంలో గతంలో కంటే ఎక్కువ స్థానాల్లో వైసిపి విజయం సాధిస్తుందని జోస్యం చెప్పారు. బొబ్బిలిలో తానే పోటీ చేసి విజయం సాధిస్తానని ధీమా వ్యక్తంచేశారు. ఆయనతో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, పట్టణ అధ్యక్షులు ఇంటి గోపాలరావు ఉన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్

నేడు మంత్రి బొత్స రాక

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ మండలంలో మంత్రి బొత్స సత్యనారాయణ సోమవారం పర్యటించనున్నట్లు ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం వల్లంపూడిలో మంత్రి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వల్లంపూడి, బానాది, వావిలపాడు గ్రామాల్లో నూతన సచివాలయ భవనాలను మంత్రి ప్రారంభిస్తారని చెప్పారు. ఈ మేరకు సచివాలయ సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

పూడికలతో ఇబ్బందులు లేకుండా చర్యలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వర్షాకాలంలో నగరంలోని ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన పూడికల వల్ల ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ ఆర్. శ్రీరాములునాయుడు తెలిపారు. ఈ మేరకు గంట స్తంభం నుంచి బుద్ధ విగ్రహం వరకు ఉన్న ప్రధాన కాలువ పూడికతీత పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. ఈ పనులను కమిషనర్ ఆదివారం పరిశీలించారు. ఏటా వర్షాలు కురిసే సమయంలో ప్రధాన కాలువలలో పూడిక పేరుకుపోవడంతో వర్షపు నీరు రోడ్లపైకి ప్రవహించి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రధాన కాలువలలో పూడికలను తొలగిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, కాంట్రాక్టర్ మత్స సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు ఇద్దరు ఎంపిక

ప్రజాశక్తి-బొబ్బిలి

శ్రీకాకుళంలో ఆగస్టు 11, 12, 13 తేదీల్లో జరిగే అండర్-11 రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయి పోటీలకు కె.జోహిత్, కె.శ్రీయాన్ ఎంపికైనట్లు చెస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు, కోచ్ గణేష్ చెప్పారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన అభినందించారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-బాడంగి

మండలంలోని పి.వెంకంపేట గ్రామానికి చెందిన వాసిరెడ్డి శ్రీదేవి ఇటీవల పిడుగుపాటుకు గురై మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ఆదివారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ వాసిరెడ్డి శంకర్రావు, తదితరులున్నారు.

పర్యాటక రంగ అభివృద్ధికి ప్రాధాన్యత

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారని టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ భీమిలి మండలం అన్నవరంలో సుమారు 40 ఎకరాల్లో ఒబెరాయి గ్రూప్ అఫ్ సంస్థ సెవెన్ స్టార్ సౌకర్యాలతో నిర్మించే లగ్జరీ రిసార్ట్‌కు సిఎం వర్చువల్ శంకుస్థాపన చేశారని తెలిపారు. ఈ ప్రాజెక్టు వల్ల సుమారు 5500 మందికి ఉపాధి లభించడమే కాకుండా పర్యాటకంగా రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు చోటివ్వొద్దు

ప్రజాశక్తి-రామభద్రపురం

చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు లాడ్జిలో గదులు ఇవ్వరాదని ఎస్ఐ సురేంద్రనాయుడు.. నిర్వాహకులను హెచ్చరించారు. ఆదివారం పోలీసు సిబ్బందితో కలిసి మండలంలో ఉన్న వివిధ లాడ్జిల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధారాలు చూపని అపరిచిత వ్యక్తులకు గదులు కేటాయించవద్దని సూచించారు. గదుల్లో దిగే వారిని గమనిస్తూ ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఎవరైనా చట్ట వ్యతిరేక పనులు చేస్తూ పట్టుబడితే లాడ్జి నిర్వాహకులపై కూడా కేసులు నమోదు చేస్తామని తేల్చిచెప్పారు.

పార్కులో పర్యాటకుల సందడి

సీతంపేట : స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో పర్యాటకులు సందడి చేశారు. పార్కులో ఉన్న అందాలను ఆశ్వాదించారు. హ్యాంగ్ బ్రిడ్జిపై నడిచివెళ్లారు. జలవిహార వద్ద బోటు షికారు చేశారు. చిన్నారులు మినీ ట్రైన్ ఎక్కి ఆడుకున్నారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెర్లు కొట్టారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు

మోడల్ స్కూల్‌కు ఏమైంది?

- అడుగడుగునా వివాదాలు
- నెల క్రితమే ప్రిన్సిపల్‌పై సస్పెన్షన్ వేటు
- తాజాగా హిందీ టీచర్ అనుచిత ప్రవర్తన
- బిక్కుబిక్కుమంటున్న విద్యార్థినులు

ప్రజాశక్తి-మెంటాడ

పెదమేడపల్లిలో మోడల్ స్కూల్

మండలంలోని పెదమేడపల్లి మోడల్ స్కూల్‌ను వరుసగా వివాదాల చుట్టుముడుతున్నాయి. ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయడం మొదలుకొని పలుమార్లు వివాదాలకు కేంద్రబిందువుగా మారింది. తాజాగా విద్యార్థినుల పట్ల హిందీ ఉపాధ్యాయుడి అనుచిత ప్రవర్తన, అంతకుముందు ఓ టీచర్ వెకిలి చేష్టలు వంటి ఘటనలతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటున్నారు. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం నష్టనివారణ చర్యలకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగానే తాజా వివాదానికి కారకుడైన హిందీ ఉపాధ్యాయుడిపై చర్యలు చేపట్టేందుకు కసరత్తు మొదలుపెట్టినట్టు సమాచారం. తాజా ఉదంతంపై బొబ్బిలి డిప్యూటీ డిఇఒ బ్రహ్మాజీ.. ఆర్‌జెడికి పంపిన నివేదికలో ఆ హిందీ ఉపాధ్యాయుడిపై ఆరోపణలు వాస్తవమేనని నివేదించిన నేపథ్యంలో ఒకట్రెండు రోజుల్లోనే ఆయనపై చర్యలు ఉంటాయని భావిస్తున్నారు.

పెదమేడపల్లి మోడల్ స్కూల్ కొన్నాళ్లుగా తరచూ ఏదో ఒక వివాదంతో వీధిన పడుతోంది. ఈ స్కూల్ పేరు చెబితేనే ఈ ప్రాంతీయులు పెదవి విరిచే పరిస్థితులు ఎదురయ్యాయి. తాజాగా హిందీ ఉపాధ్యాయుడి నిర్వాకమొకటి బయట పడడంతో ప్రస్తుతం అందులో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యామ్నాయంపై దృష్టి పెడుతున్నట్టు ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగంలో అంతర్మథనం మొదలైంది. వెంటనే మేల్కొని నష్టనివారణ చర్యలకు దిగకుంటే మిగిలిన కొద్దిపాటి పరువు కూడా పోతుందని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

నెల క్రితమే ప్రిన్సిపల్‌పై వేటు

ఇక్కడ ప్రిన్సిపల్‌గా పనిచేసిన జి.సుమంత్‌పై నెల రోజుల క్రితమే సస్పెన్షన్ వేటు పడింది. ఆయనపై అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి. స్కూల్ ఐటి ల్యాబ్‌కు మంజూరైన రూ.1.20 లక్షల నిధుల వినియోగంలో అవకతవకలకు పాల్పడినట్టు, స్కూల్ ఆవరణలోని గ్రావెల్‌ను అమ్ముకున్నట్టు ఆరోపణలు వచ్చాయి. పాఠశాల అభివృద్ధి కోసమంటూ పుస్తకాలు ముద్రించి మరీ విరాళాలు సేకరించడం, పాఠశాలలో 100 మందిని మాత్రమే చేర్చుకోవాలన్న నిబంధనలకు విరుద్ధంగా 121 మందిని చేర్చుకున్నారని, ఇందుకు తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు గుప్పుమన్నాయి. పాఠశాల నిధి, గ్యాస్ డబ్బు వినియోగంలోనూ చేతివాటం చూపారని.. ఇలా అనేక ఆరోపణలు విచారణలో రుజువవడంతో ఇటీవలే ఆయన్ను సస్పెండ్ చేశారు.

అక్కడా అంతే..

తాజా వివాదానికి కారకుడైన హిందీ ఉపాధ్యాయుడు గతంలో పనిచేసిన చోట కూడా ఇలాంటి చిల్లర పనులు చేసినట్టు చెబుతున్నారు. అధికారుల మందలింపులు, హెచ్చరికలను సైతం పట్టించుకోలేదన్న వాస్తవం తాజాగా తెరపైకి వచ్చింది.

అడుగడుగునా వేధింపులు

ఆదర్శ పాఠశాలలో ఆ మధ్య కూడా హాస్టల్‌లో పనిచేసిన మహిళా ఉద్యోగి పట్ల ఇద్దరు రాజకీయ నేతలు లైంగిక వేధింపులు పర్వం వెలుగులోకి వచ్చింది. స్థానికంగా సమస్యను సద్దుమణిగించారు. తరువాత ఆ మహిళను అక్కడ నుంచి బదిలీ చేసేందుకు రాజకీయ ఒత్తిడి మొదలైనట్లు తెలిసింది. విద్యార్థుల పట్ల ఉపాధ్యాయుల అకృత్యాలు ఇక్కడ పలుమార్లు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది.

పిల్లలు ఫోన్ చేసి ఏడ్చారు

హిందీ ఉపాధ్యాయుడి అనుచిత ప్రవర్తనను బాధిత విద్యార్థులు ఫోన్‌లో తెలియజేశారు. ఆయన నిర్వాకాన్ని చెప్పుకొని కన్నీటి పర్యంతమయ్యారు. మొత్తం విషయాన్ని రీజనల్ జాయింట్ డైరెక్టర్ జ్యోతికుమారికి వివరించాను. త్వరలోనే తగు చర్యలు ఉంటాయి.

– డిప్యూటీ డిఇఒ బ్రహ్మాజీ

సస్పెన్షన్‌పై ట్విస్ట్

ఆదర్శ పాఠశాలకు సంబంధించి తాజాగా మరో వివాదం తెరపైకి వచ్చింది. తన సస్పెన్షన్ అక్రమమంటూ ఇటీవల సస్పెండ్ అయిన ప్రిన్సిపల్ సుమంత్ జాతీయ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్‌ను ఆశ్రయించారు. తనపై తీసుకున్న చర్యలు నిబంధనలకు పూర్తి విరుద్ధమని అందులో పేర్కొన్నారు. ఎస్‌సినైన తనపై కక్ష సాధింపులో భాగంగానే సస్పెండ్ చేశారని ఆయన ఆరోపించారు. తనతోపాటు అక్కడ పనిచేస్తున్న ఐదుగురు టీచర్లను టార్గెట్ చేసి నిరాధార ఆరోపణలతో ఇరికించాలని చూస్తున్నారని ఆరోపించారు. తక్షణమే తన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరారు. కమిషన్‌కు పంపిన లేఖ ప్రతిని ఆర్‌జెడి జ్యోతికుమారికి పంపించినట్లు పూర్వ ప్రిన్సిపల్ సుమంత్ తెలిపారు.

ఉపేక్షించం

ఇక్కడి పరిస్థితి, తాజా పరిణామాలపై ఆర్‌జెడి జ్యోతికుమారి వద్ద 'ప్రజాశక్తి' ప్రస్తావించగా, ఆమె తీవ్రంగా స్పందించారు. వాటిని ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్రమాలకు పాల్పడిన ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేశామన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో శంకుస్థాపన మాసోత్సవంలో భాగంగా వివిధ అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి శంకుస్థాపనలు చేశారు. ఒకటో డివిజన్లోని పూల్‌బాగ్ లక్ష్మీ గణపతి కాలనీ, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంతంలో రూ.37.20లక్షలతో నిర్మించనున్న రహదారులు, కాలువ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. వేణుగోపాలపురంలో 40 కెఎల్ సామర్థ్యం గల వాటర్ ట్యాంకు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పనపై దృష్టి సారించామన్నారు. ప్రస్తుతం శంకుస్థాపనల మాసోత్సవాన్ని నిర్వహిస్తూ నెలరోజులపాటు వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి, ప్రజావసరాలను తీర్చనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయ యాదవ్, జోనల్ ఇన్చార్జిలు ముద్దాడ మధు, ముచ్చు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యం : లోక్‌సత్తా

ప్రజాశక్తి-బొబ్బిలి

వాలంటీర్ల కన్నా సర్పంచులు హీనంగా ఉన్నారని, పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యమైందని లోక్‌సత్తా రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు భీశెట్టి బాబ్జి అన్నారు. కళింగ వైశ్య భవనంలో ఆదివారం విలేకరులతో మాటాడుతూ వైసిపి ప్రభుత్వం వాలంటీర్లకు ఇస్తున్న ప్రాధాన్యత సర్పంచులు, ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులకు లేదన్నారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగి రెండేళ్లు పూర్తి అయినా నిధులు లేక అభివృద్ధి చేయలేదన్నారు. సర్పంచులు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు ఉత్సవ విగ్రహాల్లా ఉన్నారన్నారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధులు వెనక్కి తీసుకోవడం దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో స్థానిక సంస్థలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా పరిషత్తు చైర్మన్లకు కూడా నిధులు లేకపోవడం దారుణమన్నారు. స్థానిక సంస్థలను బలోపేతం చేయాలని జయప్రకాశ్ నారాయణ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని చెప్పారు. వెనక్కి మళ్లిన 15వ ఆర్థిక సంఘం నిధులు స్థానిక సంస్థలకు బదలాయించాలని డిమాండ్ చేశారు. మైనింగ్ చెక్ బాధ్యత ప్రయివేట్ సంస్థకు ఇవ్వడం అన్యాయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఓటు ఇండియా.. సేవ్ డెమోక్రసీ కార్యక్రమం చేపట్టామని, జిల్లాలో ఈ నెల 20నుంచి చేపడతామని చెప్పారు. సమావేశంలో లోక్ సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు కె.పాపారావు ఉన్నారు.

ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

'ఫెర్రో'పై విద్యుత్తు భారం తగ్గించాలి

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలపై విద్యుత్తు భారం తగ్గించాలని సిఐటియు ఆధ్వర్యంలో మండలంలోని ఎం.బూర్జవలస, పణుకువలస, మెట్టవలస గ్రామాల్లో ఆదివారం ప్రచార యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు మాట్లాడుతూ ప్రభుత్వం జులై ఒకటో తేదీ నుంచి ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలపై భారీగా విద్యుత్తు భారాన్ని మోపిందన్నారు. యూనిట్‌కు రూ.5 నుంచి రూ.8.59కు పెరగడం వల్ల పరిశ్రమలు మూతపడి, కార్మికులు రోడ్డున పడే అవకాశముందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం తప్పుడు నిర్ణయాల వల్ల విజయనగరం జిల్లాలో 22 పరిశ్రమలను మూసివేసేందుకు యాజమాన్యాలు సిద్ధపడుతున్నాయని చెప్పారు. దీనివల్ల 10 వేల మంది కార్మికులు రోడ్డున పడే పరిస్థితి వస్తుందన్నారు. ఫెర్రో పరిశ్రమలకు తక్షణమే రాయితీపై విద్యుత్తు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్.గోపాల్, కె.శంకర్రావు, అప్పలనాయుడు, కార్మికులు పాల్గొన్నారు.

బిసిలు ఏకతాటిపైకి వస్తేనే రాజ్యాధికారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బిసిలంతా ఏకతాటిపైకి వస్తేనే రాజ్యాధికారం లభిస్తుందని రాష్ట్ర యాదవ హక్కుల పోరాట సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ ఇసరపు శేఖర్ యాదవ్ అన్నారు. ఆదివారం ప్రదీప్ నగర్‌లో గల యాదవ సంక్షేమ సంఘ కార్యాలయంలో బిసిల నాయకుడు రామచంద్ర యాదవ్ ఈనెల 12న జిల్లాకు రానున్న దృష్ట్యా ఆయన పర్యటనను విజయవంతం చేయాలని కోరుతూ గోడపత్రికను విడుదల చేశారు. వెనుకబడిన కులాలు అభివద్ధి చెందాలి అంటే రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవడం ఒక్కటే మార్గమని అన్నారు. జిల్లాలోని బలహీన వర్గాల నేతలంతా ఏకతాటిపైకి రావాలని అప్పుడే బీసీల రాజ్యాధికారం లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాగరపు ఈశ్వర్ ప్రసాద్‌తో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన వెనుకబడిన కులాల నాయకులు పాల్గొన్నారు.

సుందర గోవిందరావు లేని లోటు తీర్చలేనిది

ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

గోవిందరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి -భోగాపురం

భోగాపురం గ్రామానికి చెందిన సీనియర్ వైసిపి నాయకులు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు సుందర గోవిందరావు లేని లోటు తీర్చలేనిదని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. సుందర గోవిందరావు మొదటి వర్ధంతి సందర్భంగా సుందరపేట సమీపంలోని సేరి పొలంలో ఆయన కుమారులు హరీష్, రమేష్, వెంకటేష్ మరియు కుటుంబ సభ్యులు ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు. అక్కడ జరిగిన సభలో మాట్లాడుతూ భోగాపురం అభివృద్ధిలో సుందరరావు కీలక పాత్ర పోషించారని అన్నారు. నియోజకవర్గంలో పార్టీ కోసం, తన గెలుపు కోసం ఇంతలా కృషిచేసిన మరో నాయకుడు లేరని అన్నారు. తనకు వెన్నుదన్నుగా ఉండాల్సిన వ్యక్తి నేడు లేకపోవడం చాలా బాధాకరంగా ఉందన్నారు. మండల వైసిపి కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఏడాది కిందట ఒక మంచి వ్యక్తిని కోల్పోయామని అన్నారు. పార్టీకి అండదండగా ఉంటూ అనేక కార్యక్రమాలు ముందుండి చేపట్టే వారని అన్నారు. సచివాలయం కన్వీనర్ పడాల శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ భోగాపురంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు ఆయన హయాంలో జరిగాయని అన్నారు. ముఖ్యంగా భోగాపురం బట్టి కాలువకు నిధులు తెచ్చిన వ్యక్తి ఆయనేనని అన్నారు. కారి గొల్లపేట, చెరువు కొమ్ము గొల్లపేట రహదారులు, వంతెన ఎమ్మెల్యే సహకారంతో తీసుకువచ్చారని అన్నారు. అనంతరం అక్కడికి వచ్చిన వారందరికీ భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమారులు మణిదీప్, ప్రదీప్, చిక్కాల సాంబ, జి. సన్యాసినాయుడు, కర్రోతు శ్రీనివాసరావు, రావాడ బాబు, పతివాడ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కిరాయి మూకలపై చర్యలు తీసుకోవాలి

డిఎస్‌పికి జనసేన ఫిర్యాదు

ప్రజాశక్తి-బొబ్బిలి

జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ కుటుంబ మహిళలపై అసభ్యకరంగా వ్యాఖ్యలు చేసిన వైసిపి కిరాయి మూకలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం ఆ పార్టీ నాయకులు డిఎస్‌పికి ఫిర్యాదుచేశారు. వైసిపి కిరాయి నాయకులు, పెయిడ్ మీడియా ఛానళ్ల కలిసి పవన్ కుటుంబంపై అసభ్య ప్రచారం చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యక్రమాల నిర్వహణ కార్యదర్శి బాబు పాలూరు, బొబ్బిలి, తెర్లాం, రామభద్రపురం, బలిజిపేట మండలాల అధ్యక్షులు సంచాన గంగాధర్, మరడాన రవి, బవిరెడ్డి మహేష్, బంకురు పోలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

డిఎస్‌పికి ఫిర్యాదు చేస్తున్న జనసేన నాయకులు

యువతకు అండగా ఉంటాం : జనసేన

నెల్లిమర్ల : యువతకు జనసేన అండగా ఉంటుందని ఆ పార్టీ నాయకులు లోకం మాధవి తెలిపారు. ఆదివారం అగ్నిపథ్ ఉద్యోగాలకు శిక్షణ తీసుకుంటున్న జరజాపుపేట, దన్నానపేట యువకులకు లోకం మాధవి పోషక పదార్థాల కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత సైన్యంలో చేరడానికి కఠిన శిక్షణ తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. నియోజకవర్గ స్థాయిలో యువత అధిక సంఖ్యలో ఇండియన్ ఆర్మీకి ఎంపికవుతారని ఆశాభావం వ్యక్తంచేశారు.

రామారావు మాస్టారుకు గిరిజనుల బ్రహ్మరథం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో పూలిపుట్టి పంచాయతీ ఆనపకాయలగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అంపిలి రామారావుకు మండ కాలనీలో పాఠశాలకు బదిలీ అయ్యింది. ఈ సందర్భంగా ఆదివారం గ్రామస్తులు, తోటి ఉపాధ్యాయులు రామారావు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి గిరిజనులు బ్రహ్మరథం పట్టారు. ఇంతవరకు ఏ ఉపాధ్యాయుడికి లేనివిధంగా గిరిజనులు మేళతాళాలతో, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలతో స్వాగతం పలికారు. కాలు కడిగి ఊరంతా భుజంపై కూర్చుని పెట్టి ఊరేగించారు. అనంతరం జరిగిన సభలో ఎంఇఒలు ఆనందరావు, సూర్యచంద్రరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా ప్రజల మన్ననలు ఇంతగా పొందడం గొప్ప విషయమన్నారు. ఉపాధ్యాయుడిగా ఇక్కడ గిరిజనులకు ఐదేళ్లుగా అనేక సేవలు అందించారని, అందుకే ఇక్కడ ప్రజలు బ్రహ్మరథం పట్టారని కొనియాడారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాలు సన్మానించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాశరావు, జిల్లా కార్యదర్శి కె.కృష్ణారావు, గౌరవ అధ్యక్షులు హారిక భాస్కరరావు, కార్యదర్శి సింహాచలం, ప్రకాశం, కె.పారయ్య, కాంతారావు, కృష్ణారావు, ఈదపురం ప్రధానోపాధ్యాయులు బి.రామారావు, పాలకొండ యుటిఎఫ్ మండల కార్యదర్శి పి కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కొత్తవలస రూరల్

మండలంలోని కాటకాపల్లిలో విశ్వం హెల్త్ కేర్ హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ నేమాని విశ్వనాథం 67జయంతి సందర్భంగా ఎల్ జి హాస్పిటల్స్, విశ్వం హెల్త్ కేర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నితీష్ నేమాని ఆధ్వర్యంలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపులో విశాఖపట్నంలోని ఎల్ జి హాస్పిటల్స్‌లో అత్యున్నతమైన 13 మంది వైద్య నిపుణుల సహకారంతో సుమారు 350 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. మెరుగైన వైద్య సేవలు అవసరం అయిన వారికి ఎల్ జి హాస్పిటల్స్ లో ఆరోగ్యశ్రీ కార్డుపై ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి గ్రామ యువకుల నుండి మంచి స్పందన వచ్చింది. సుమారు 40 మంది వరకు రక్తదానం చేశారు. ప్రతి నెలా కాటకాపల్లి గ్రామంలో విశ్వం హెల్త్ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని డాక్టర్ నితీష్ నేమాని తెలిపారు. కార్యక్రమంలో ఎల్ జి హాస్పిటల్స్ గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ రాకేష్, కెజిహెచ్ గైనిక్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ కుమారి, చెవి ముక్కు గొంతు నిపుణులు డాక్టర్ సుప్రదీప్, సర్జన్ డాక్టర్ జోగేంద్ర, దంతవ్యాధి నిపుణులు డాక్టర్ శిరీష, డాక్టర్ కుందన , జనరల్ ఫిజిషియన్ డాక్టర్ భరద్వాజ్, ఇతర వైద్య నిపుణులు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మరుపెంటలో ఏనుగుల సంచారం

డ్రిప్ ధ్వంసం

ప్రజాశక్తి- గరుగుబిల్లి

మండలంలో గడిచిన ఐదురోజుల గొట్టివలసలో తిష్ట వేసిన ఏనుగులు ఆదివారం మరుపెంట గ్రామ పరిసరాల్లో సంచరిస్తున్నాయి. దాదాపు నాలుగు రోజులుగా గొట్టివలస పరిసరాల్లో తిష్ట వేసిన ఏనుగులు నాటు బళ్లు, ట్రాక్టర్ తొట్టె, తౌడు బస్తాలుతో పాటు ఇంటి కిటికీలను ధ్వంసం చేశాయి. శనివారం రాత్రి ఈ ప్రాంతం నుంచి మరుపెంట తరలి వెళ్లాయి. అయితే మరుపెంట తరలి వెళ్లిన ఏనుగులు ఎంపిపి ఉరిటి రామారావు పొలంలో ఇటీవల వేసిన డ్రిప్ సిస్టంతో పాటు దాదాపు అరఎకరా పొలంలో వేసిన పామాయిల్ మొక్కలను ధ్వంసం చేశాయి. ఏనుగులు డ్రిప్పు సిస్టంను ధ్వంసం చేయడంతో అవి ఎందుకూ పనికి రాకుండా పోయిందని ఎంపిపి తెలిపారు. డ్రిప్ సిస్టంతో పాటు పామ్ ఆయిల్ మొక్కలను ధ్వంసం చేసిన విషయం అటవీ శాఖఅధికారులకు తెలిపినా తాము ఏం చేస్తామని సమాధానం చెబుతున్నారని ఎంపిపి తెలిపారు. సుమారు రూ.4లక్షలు వరకూ నష్టం వాటిల్లిందన్నారు. తక్షణమేఈ ప్రాంతం నుంచి ఏనుగులను తరలించేందుకు అధికారులు తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.